
# లెట్ దేర్ బి మోర్ లైట్



నింగిలోని నక్షత్రాలన్నిటినీ తీసుకు వచ్చినట్లుగా ఉంది కల్యాణి. మబ్బుల మాటులోంచి చుక్కలు తొంగి తొంగి చూస్తున్న రీతిలో మిణుకు మిణుకు మంటున్నాయి. 'అవి' ఆ శాస్త్రజ్ఞుడి బుర్రను తొలుస్తున్న సమస్యకు పరిష్కారం. "ఆ క్షణమే దొరికింది. అతడు సంతోషంగా అరిచాడు...

"మీరు తల్చుకొంటే ఈ పని చెయ్యగలరనే నా నమ్మకం! శాస్త్రజ్ఞులనే వాళ్లు సాధ్యాసాధ్య సమర్థులు. మీరే తల్చుకొని మమ్మల్ని గట్టున పడెయ్యాలి! మీకు మేం తరతరాలూ రుణపడి ఉంటాం!" గుక్క తిప్పుకోకుండా చెప్పదల్చుకొన్నది చెప్పాను, అన్న రీతిలో ఆగాడు వజీరా.

ఎదురుగా కుర్చీలో ఉన్న నాథన్‌కు ఆశ్చర్యంగా ఉంది. అసలు వజీరాకు ఈ ఆలోచన ఎలా వచ్చిందో కూడా నాథన్‌కు అంతుబట్టటంలేదు. క్షణం సంశయించి అదే ప్రశ్న అడిగాడు. అసలు మీకీ ఊహ ఎలా తట్టిందో చెప్పండి".

వజీరా నవ్వేశాడు. "ఎలా తడితేనేం, ఆలోచన అద్భుతంగా ఉంది గదా?"

"అవుననుకోండి... కానీ...'

అలాంటి సందేహాలేవీ వద్దు! ఇది అపూర్వమైన ప్రయోగం కావచ్చు కాదనను! దీనికి ఏడాది రెండేళ్లు పట్టవచ్చు లేదా రెండు దశాబ్దాలైనా పట్టవచ్చు. కానీ ఇది సాధ్యమేనని నా ఉద్దేశ్యం!" వజీరా నెమ్మదిగా అన్నాడు.

"ప్రయోగం సరే, ఎంత కాలమైనా పట్టవచ్చు! అన్నేళ్ళు పట్టి చివరకు ఫలితం ఇవ్వనూ వచ్చు పూర్తిగా విఫలం కానూ వచ్చు. కానీ... మీకీ ఆలోచన ఎలా తట్టిందో చెబితే, అది వింటున్నపుడు నాకేదైనా క్లూ దొరికి ఆ పద్ధతిలో ప్రయోగం ఆరంభించగలనేమోనని నా ఉద్దేశ్యం!" నాథన్ నెమ్మదిగా అన్నాడు.

వజీరా నవ్వాడు. "మీరు తమాషాగా అంటున్నారు. మీకు మేం సలహాలనివ్వటమేమిటి? ఏ సలహా ఎవరిచ్చారని శాస్త్రజ్ఞులు ఇన్ని రకాల రోగాలకు, వ్యాధులకు చికిత్సలు కనిపెట్టారో చెప్పండి పెనిలిన్‌ను కనిపెట్టిన ఫెమింగ్‌కెవరైనా సూచించారా, ఎక్స్‌రేలను గుర్తించమని రాంట్‌జన్‌కు ఎవరైనా చెప్పి పెట్టారా, ఇన్సులిన్‌ను కనిపెట్టి దయాబెటిక్స్‌కు ప్రాణదానం చేయాల్సిందిగా బాంటింగ్, బెస్ట్‌లకెవరైనా సలహా ఇచ్చారా, ఇలాంటివన్నీ స్వచ్ఛందంగానో, యాధృచ్ఛికంగానో జరిగిన శాస్త్ర పరిశోధన ఫలితాలే గదా! అలాగే.... మీరూ...."

వజీరాకేసి తలెత్తి చూశాడు నాథన్. వజీరా... నలభై అయిదు, నలభై ఆరేళ్ల వయసుకు మించదు, తల మీద అక్కడక్కడ గత వైభవ స్మృతి చిహ్నాలకు మల్లే ఇంకా గాలికి ఎగురుతూ ఉన్న నాలుగు పుంజీల వెంట్రుకలు. ముఖంలో వర్ణించనలవికాని గ్లామర్. పెదాలతో మాట్లాడుతున్నా, కళ్లతో ఎదుటివారి గుండెల్లోకి ఆలోచనల్లోకి తొంగిచూస్తున్న పద్ధతి.... ఇలా చెప్పుకొంటూ పోతే వేల వేల లక్షణాలు. అన్నీ కలిసిన అచ్చమైన రాజకీయ నాయకుడు వజీరా.

"సరే, మీరు మరీ మొహమాట పెట్టి అడుగుతున్నారు, కాబట్టి చెప్తున్నాను! వచ్చే ఏడాది చివర్లో బహుశా ఎన్నికలు జరిపించాల్సి రావచ్చు! మీకు తెలుసుగదా, ఎన్నికలంటే ఆషామాషీకాదు. మా మటుకు మాకు అవి కురుక్షేత్ర సంగ్రామాలు! నీతికి అవినీతికి మధ్య అవి పోరాటరంగాలు! గత యాభై అరవై సంవత్సరాలుగా ఈ దేశంలో పాలనమాదే మాతాతలు పోరాడి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని మేం తరతరాలుగా పరిరక్షిస్తున్నాం... కానీ ఎంత చేసి ఏం లాభం! ఈ దేశంలో ప్రజలు చాలావరకు కృతఘ్నులు! మేం చేసిన సేవలు మర్చిపోవటమే వారికి ఉన్న ఏకైక లక్ష్యం అనిపిస్తోంది.... ఎన్నికలొస్తున్నాయి గదానని ఇటీవల దైవ సందర్శన చేద్దామని వెళ్ళాను గదా! అదుగో అక్కడ తట్టింది నాకీ ఆలోచన... ఒక విధంగా చూస్తే నాకీ ఊహ ఆ పరమేశ్వరుడే కలిగించాడేమోననిపిస్తోంది.

నిజమే కాబోలు. శివుడాజ్ఞలేనిదే చీమైనా కుట్టదంటారు. కానీ ఈ మహాశయుడ్ని కుట్టిన చీమ, తన ప్రాణం మీదకు తెస్తోంది!

"వింటున్నారా... గర్భ గుడిలోని విగ్రహాన్ని చూసాను. గుడి గోపురాన్ని చూసాను. తిరిగి వస్తుంటే బజారులో ఒక పక్కన ఒక చిన్న షాపులో ఉన్న దేవుడి ఫోటోలనూ చూశాను. గుడిలో కనిపించనిదేదో నాకు ఆ ఫోటోలలో కనిపించింది. గర్భగుడిలోని విగ్రహం చుట్టూ లేని కాంతిపుంజం దాన్ని ఏ పేరుతో పిల్చుకొంటారో మీ ఇష్టం.. నాకు ఇదే బాగుంది. ఆ కాంతి పుంజం ఫోటోలో కనిపించింది! అది చూసి వెంటనే మీ దగ్గరికి పరిగెట్టుకొచ్చాను!" అంటూ ఆగాడు వజీరా.

నాథన్‌కు ఇప్పుడు అంతా అర్థమవుతోంది. ఇది పూర్తిగా పేవ్‌మెంట్ ఫోటో ప్రభావం!!

మీకు అర్థమయింది గదా, నేను చెప్పదలుచుకొన్నది! మనుషుల్లో మహానుభావులే దేవుళ్ళయ్యారని విన్నాను! మీరు చేయాల్సిన పనంతా ఒక్కటే! మామూలు మనుషులకు మా వంశం భిన్నమైనదని చెప్పటానికి వీలుగా మా వెనుక ఒక కాంతిపుంజం ఉండేలా ఏర్పాటు చేయాలి! అది మా బుద్ధికుశలతకు దీటుగా ఉండాలి. ఈ జాతికి మేం చేస్తున్న సేవలకు అది ప్రతీకగా నిలవాలి! ప్రజలు మమ్మల్ని చూడటానికి ముందు ఆ కాంతి పుంజాన్ని చూడాలి! అసలు అదే మా వంశానికి కీర్తి పతాక కావాలి! మీరేం చేస్తారో మీ ఇష్టం! ఎలా సాధిస్తారో మీ బాధ్యత! మీకు నిధుల కొరత ఉండదు... బాధ్యతంతా మీ మీద పెడుతున్నా!"

నాథన్‌కు చిన్నతనంలో వాళ్ల అమ్మమ్మ చెప్పిన కథలు గుర్తొచ్చాయి. కథల తీరు వేరువేరైనా ఆ కథల్లో రాజుగార్ల పాత్రలన్నీ ఒకటే! పులిపాలు తెమ్మనో, కుందేటి కొమ్ము తెమ్మనో రాజు ఆజ్ఞాపించటం, ఆజ్ఞను సరిగ్గా పాటించలేకపోతే శిరస్సు వేయి ముక్కలవుతుందని శపించడుగానీ తల నరికి కోట గుమ్మానికి వేళ్ళాడగడతాననటం మాత్రం ఖాయం!

వజీరా ఇపుడు చేస్తున్నదదే... ఈ అభ్యర్థనల వెనుక ప్రచ్ఛన్నంగా ఉన్న హెచ్చరికలూ నాథన్‌కు అర్థమవుతున్నాయి!

వజీరా లేచాడు ఇక చెప్పాల్సిందేమీ లేదన్నట్లుగా!

నాథన్ కూడా లేచి వజీరాకు తోడొచ్చాడు. వీడ్కోలు చెప్తున్న నాథన్‌తో కరచాలనం చేస్తూ, మరోసారి గుర్తుచేశాడు వజీరా గుర్తుంచుకోండి! ఎన్నికలు వచ్చే ఏడాది ఉండొచ్చు! మీరు దానికి ఒక్క ఆర్నెల్లముందు నాటికి ఈ కాంతి పుంజాన్ని సిద్ధం చేసి ఇస్తే సత్ఫలితం ఉంటుంది. మా వంశమూ, ఈ జాతి మీకు రుణపడి ఉంటుంది!" అన్నాడు వజీరా.

నాథన్ తల ఊపాడు సరేనంటూ.

నాలుగువైపులనుంచీ కమెండోలు వచ్చి వజీరా చుట్టూ నిలబడ్డారు.

మనిషికి మనిషికి మధ్య మనుషుల తెరలు! బతుకుకూ, భయానికి మధ్య అవి కనిపించని అలలు!!

నాథన్ నవ్వుకొన్నాడు. వజీరా కారెక్కాడు. లోపల కూర్చున్న వజీరా, మళ్ళీ ఒకసారి

తల బయటకు పెట్టి "మీకీ విషయంలో సహాయం కావాలన్నా ఎన్ని నిధుల ఆవశ్యకత ఉన్నా ఒకటే మాట గుర్తుపెట్టుకోండి ఆపరేషన్ లైట్! నేనే కాయిన్ చేశా ఈ పేరు ప్రాజెక్టుకు సరైన పేరు ఇదేనని నా ఉద్దేశం! కదా?

నాథన్ తల ఊపాడు. కారు కదిలింది. రాజు వెడలె. ఇరు దిక్కుల డాల్ కత్తుల్ మెరయిగ... నలువైపుల నలుగురు కమెండోల కదలగ... రవితేజములన తను తేవాల్సి ఉంది!!

ఆపరేషన్ లైట్!... నెమ్మదిగా గొణుక్కున్నాడు నాథన్...

❖ ❖ ❖

పదహారు నెలలు ఇట్టే గడిచిపోయాయి. మొదటి ఆరు నెలల పాటూ నాథన్ ప్రపంచంలోని చాలామంది మేధావులను సంప్రదించాడు. అందరూ 'ఈ వెర్రి ఆలోచన నీకెందుకు వచ్చింది?' అంటూ వేళాకోళం ఆడినవాళ్ళేగాని ఎవ్వరూ తారక మంత్రాన్ని మాత్రం సూచించినవాళ్ళు లేరు. కనీసం దారి ఇటు అంటూ సూచించిన వాళ్లూ లేకపోయారు. దాంతో అది పద్ధతి గాదనుకొని నాథన్ చరిత్రను శోధించాడు. విజ్ఞాన శాస్త్రగ్రంథాల్నీ విశ్లేషించి చూశాడు. ఎక్కడా ఒక్క క్లూ కూడా కనిపించలేదు.

'ఆపరేషన్ లైట్'.... అది తన లైఫ్ తీస్తుందేమోనన్న బెంగపట్టుకొందతనికి! ఇంటా, బయటా ఎక్కడ ఉన్నా ఒక్కటే ఆలోచన!

నాథన్ పద్ధతి చూస్తే మనోరమకు బెంగపట్టుకొంది. భర్త ఇంత దిగులుగా, బెంబేలుపడుతూ ఉండటం ఆమె ఎప్పుడూ ఎరగదు!

'ఏమిట'ని అడిగితే చెప్పడు. బాధ పంచడు. తనకు తెలియకుండానే, అర్థాంగిని కష్టాలపాలు చేయకూడదన్న తపనతోనే కాబోలు మరిన్ని ఇక్కట్లపాలు చేస్తున్నాడు!!

తండ్రి పద్ధతి ఇంట్లో పిల్లలకూ అర్థం కాలేదు. మిగిలిన వాళ్లు అది గ్రహించి కొంచెం దూరంగా ఉంటున్నా, కల్యాణి మాత్రం తన అల్లరి నదిగా కాలం కడుపుతోంది.

తండ్రి ఏదో చదువుకొంటుంటే పరిగెట్టుకువస్తుంది. ఒక చిన్న కాగితంతో! 'నాకు పడవ చేసి పెట్టవా? అంటూ!!

చిన్న చిన్న కోరికలు. చిన్నారి ఆశలు.

ఒక్కోసారి విసుక్కొంటాడు. ఒక్కోసారి కేకలేస్తాడు. ఒక్కోసారి తన ఇబ్బందికి చిన్న పిల్లలను, ఇంట్లో వాళ్లను ఇరకాటంపాలు చేస్తున్నాడని బాధపడతాడు!

ఆ రోజు రాత్రి నాథన్ తన గదిలో కూర్చుని పుస్తకమేదో తిరగేస్తోంటే గదిలోకి సుడిగాలిలా వచ్చింది కల్యాణి.

వచ్చీ రాగానే పరిగెత్తి వెళ్ళి స్విచ్ ఆఫ్ చేసింది. గదంతా చీకటి!

"ఏమిటమ్మా ఇది..." విసుక్కొంటూ అన్నాడు నాథన్.

"చూడు నాన్నా నేను లైట్‌తప్పిస్తా!" అంటూ కల్యాణి, అడుగు ముందుకేసి అరిచేయి విప్పింది.

నింగిలోని నక్షత్రాలన్నిటిని అరచేతలో పోసుకువచ్చినట్లుగా ఉంది కళ్యాణి మబ్బులమాటులోంచి చుక్కలు తొంగి తొంగి చూస్తున్న రీతిలో మిణుకుమిణుకు మంటున్నాయి మిణుగురులు!!

'ఆపరేషన్ లైట్....'

నాథన్ బుర్రలో ప్లాష్ వెలిగింది 'ఆపరేషన్ లైట్' ప్రాజెక్ట్ రూపకల్పనకు ఆ తర్వాత ఆలస్యం కాలేదు!!

❖ ❖ ❖

"నాకు తెలుసు! నాకు ఈ జాతిమీద చాలా ఆశలున్నాయి. నా ఆశల్ని ఎవరూ వమ్ము చేయలేరు! మన శాస్త్రజ్ఞులు తల్చుకుంటే చెయ్యలేనిది లేదు! ముఖ్యంగా మీరు... మీరు ఇది సాధించగలరని నాకు తెలుసు కాబట్టే, మీకీ బాధ్యతను అప్పగించాను. అయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ వజీరా తన ధోరణిలో తను చెప్పుకొంటూ పోతున్నాడు.

నాథన్ ఆ ప్రవాహానికి ఆనకట్ట వేసే ప్రయత్నం చేశాడు... "బట్, సర్..."

"నో బట్స్ అంటే ఇఫ్స్...ఐ వాంట్ రిజల్ట్స్! నాకు కావాల్సినవి ఫలితాలు. మీరు వాటిని సాధించారు! అది చాలు నాకు! ఎంత ఖర్చు పెట్టినా మీరిది సాధించారు. నాకది చాలు!!

నాథన్ మళ్ళీ నోరు తెరిచాడు. "అది కాదు సార్..."

"మీరెలా దీన్ని సాధించారో, దానికి ఎన్ని ఇబ్బందులు, కష్టాలు పాలయ్యారో, నాకు చెప్పకండి! నేనది ఊహించుకోగలను మీ శ్రమను ఈ జాతి గుర్తిస్తుంది. వచ్చే రిపబ్లిక్ డే నాడు మీ కోసం ప్రత్యకంగా సశాస్త్రీయమైన బిరుదాన్ని ప్రత్యేకంగా ప్రసాదిస్తాం... 'శాస్త్ర సామ్రాట్... ఓ వెరీగుడ్...

నాథన్ క్షణం నివ్వెరపోయాడు, ఏమిటీ ధోరణి అనుకొంటూ! తను చెప్పేది విననైనా వినడేమిటి పెద్దమనిషి, అని ఆశ్చర్యపోయాడు!

రాజకీయ నాయకులు తాము చెప్పేది చెప్పడమేగానీ ఎదుటివారి మాటలు వినేంత ఓపిక, సహనం వారికి ఉండదన్న విషయం నాథన్‌కు ఆ క్షణంలో గుర్తొచ్చింది! ఇక ఆయనకు నచ్చచెప్పే ప్రయత్నాన్ని మానుకొని, కార్యరంగంలోకి దిగాడు నాథన్.

"సరే, మీరన్నట్లుగానే అన్నీ సాధించాం! దీన్ని మీతోబాటు మీ ముందు తరాలవారికీ జన్మతః వచ్చేటట్లు ఏర్పాట్లు చేస్తున్నాం! కానీ ఇప్పుడు మీ కుటుంబంలోని వారందరికీ ఒకేసారి గనుక దీన్ని అమరిస్తే పని తేలికౌతుంది!"

వజీరా నవ్వాడు "పని తేలికవటం కాదండీ! అందరికీ ఒకేసారి అమర్చడంవల్ల దేశం నాలుగుమూలల్లోనూ మేం వేర్వేరుగా ప్రజలకు దర్శనం ఇవ్వగలం మాకు శ్రమ తక్కువ అవుతుంది. అలాగే కానివ్వండి, అందర్నీ పిలిపిస్తాం!" అంటూనే ఆయన తన సెక్రటరీకి సైగ చేశాడు.

దేశంలో ఓ మూల కొన్ని లక్షల మంది ప్రజలు చుట్టూ చేరిన ఒక వేదికపైన ఒక నాయకుడు... వజీరాయో, అతని కొడుకో, కూతురో, మనవడో... మునిమనవడో ఎవడోవాడు, ఎవడైతేనేం వాడు... తల చుట్టూ చెప్పలేనంత కాంతి పుంజంతో వాడు..

వాడి తలచుట్టూనే కాంతి తప్ప లోపల ఏమీ లేదన్న సంగతి ఇంకా తెలీని నిరక్షరాస్య భారత ఓటరు సంగతి... వాడి చుట్టూ...

'ఆపరేషన్ లైట్ తన ప్రయత్నం వల్ల ఈ భారతావని బరువు ఇంకా పెరిగిపోతుందా? బరువు పెరిగిన భూమితల్లి అయినా తనలా కాకుండా కొంత బాధ్యతాయుతంగానైనా విచ్చుకొంటుందా??

నాథన్ ఆలోచించటం మానేశాడు.

ఎదురుగా టేబుల్ మీద రక్తం స్రవిస్తున్న వజీరా తల అందులోని మెదడుతీసి పక్కనే ఉన్న డస్ట్‌బిన్‌లోకి పారేశాడు నాథన్!!

కొత్త వంశం సృష్టి దిగ్విజయంగా జరిగిపోయింది!

ఇప్పుడు మీరు బజార్లోకి వచ్చి చూడండి! మన అధినాయకుడి వంశ సంజాతుల తలల చూట్టూ చెప్పలేనంత కాంతి వెదజల్లే పరివేషం కనిపిస్తుంది. ఆ కాంతికి మైమరచిపోయే ఓటర్ల ఓట్లు బాలెట్ పెట్టెల్లో పడుతూనే ఉంటాయి!!

ఎటొచ్చీ, ఆ పాలకపుంగవుల తలలో మెదళ్లనేవి లేనేలేవన్న కఠోరసత్యం... మెదళ్లున్నా క్షణం ఆలోచించని మన జాతి ఓటరు మహాశయులకు ఎప్పుడు తెలుస్తుంది...

అసలు, తెలుస్తుందో, లేదో...!!

– ఈనాడు, ఆదివారం సంచిక